ఆర్బీకేలు.. రైతన్న నేస్తాలు

- ఆర్బీకేల్లో రైతులకు విశేష సేవలు
- గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు లభ్యం
- పనిముట్లతో సహా అన్ని పథకాలు ఆర్బీకేల్లోనే


గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిలో ఏర్పాటు చేసిన రైతు భరోసాకేంద్రం

గుర్రంకొండ : ఒకప్పుడు రైతన్నా, రైతు కష్టాలన్నా ఎవరికీ పట్టేదికాదు. రైతంటే కేవలం మనిషి కావాల్సిన ఆహారాన్ని, ధాన్యాన్ని పండించే ఓ యంత్రం. అలాంటి భావన నుంచి రైతే రాజు అన్న స్థాయికి రైతుల పరిస్థితి తీసుకొచ్చారు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుతం ఆర్బీకేలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. గ్రామాల్లో రైతులు మండలకేంద్రాలకు వెళ్లకుండా వారికి కావాల్సిన అన్ని సేవలు ఆర్బీకేల్లో అందుతున్నాయి. నాలుగేళ్లలో ఆర్బీకేలు రైతన్నలకు నేస్తాలుగా మారిపోయాయి.

రైతులకు అన్నిరకాల సేవలు ఆర్బీకేల్లోనే..

గతంలో ఏ అవసరం వచ్చిన మండలకేంద్రంలో ఉండే వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలు ఏర్పాటు చేయడం వలన రైతులు తమ వారి గ్రామాల్లోనే అన్ని రకాల సేవలను ఆర్బీకేల ద్వారా పొందుతున్నారు. ముఖ్యంగా భూసార పరీక్షలు నిర్వహించడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

కియోస్కోతో ప్రయోజనాలు

ఆర్బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. రైతులు ఇక్కడి నుంచి తమకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు కావాల్సిన కంపెనీల నుంచి 48 గంటల్లోగా నేరుగా రైతులకే అందే అవకాశముంది.

ఈ– క్రాప్‌బుకింగ్, పంట నష్టపరిహారం

సాగుచేసిన పంటలకు సంబంధించి ఆర్బీకేల ద్వారా ఈ-క్రాప్‌బుకింగ్ (పంట సాగు నమోదు)తప్పని సరిగా చేసుకొంటున్నారు. తద్వారా విపత్తులు, తుపాన్ల ద్వారా పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం పొందే అవకాశముంది. ఈ క్రాప్ సర్టిఫికెట్ ద్వారా బ్యాంకులు రైతులకు పంట రుణాలను అందజేస్తున్నాయి. దీంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది.

సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు, యంత్రాలు పంపిణీ

ఆర్బీకేల ద్వారా నిరంతం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్లను కూడా సబ్సిడీపై రైతులకు ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్నారు. వీటికోసం రైతులు మండలకేంద్రాలకు వెళ్లి రోజుల కొద్ది క్యూలోనిలబడి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆర్బీకే వ్యవస్థతో స్వంత గ్రామంలోనే అన్ని రకాల సేవలు అందుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని ఆర్బీకేల సంఖ్య	13
మండలం మొత్తం రైతులు	10,565
రైతుభరోసా పొందిన రైతులు	7,515
నాలుగేళ్లుగా పొందిన లబ్ధి	రూ. 23.65 కోట్లు
ఎరువులు, విత్తనాల సబ్సిడీపై పొందిన రైతులు	9547
వ్యవసాయపనిముట్లు, యంత్రాలు పొందిన రైతులు	247
ఉద్యానవన పంటల సాగుపై సబ్సిడీ పొందిన రైతులు	4251
ఉద్యానవన పంటలపై రైతులు పొందిన లబ్ధి	రూ. 2.24 కోట్లు


ఆర్బీకేల్లో సబ్సిడీ ఎరువులు ఆన్‌లైన్‌లో బుక్ చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

నాలుగేళ్లుగా రైతుభరోసా సాయం



ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా నాలుగేళ్లుగా రైతుభరోసా సాయం అందుతోంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వం ఇచ్చే రైతుభరోసా డబ్బు పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతోంది. పొలాల దుక్కుల దగ్గర నుంచి విత్తనాల కొనుగోలు వరకు రైతుభరోసా డబ్బులే సరిపోతున్నాయి. రైతుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి క్రమం తప్పకుండా మేలో రైతు భరోసా ఇవ్వడం హర్షనీయం.

– సుధాకర్‌రెడ్డి, మొరంపల్లె, గుర్రంకొండ మండలం

అందుబాటులోకి ఎరువులు, విత్తనాలు



ఆర్బీకేల్లో ప్రభుత్వం అన్ని రకాల ఎరువులు, సబ్సిడీపై విత్తనాలను రైతులకు అందుబాటులోకి తెచ్చింది. సీజన్లతో సంబంధం లేకుండా ఆర్బీకేల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, వ్తినాలు లభిస్తున్నాయి. మార్కెట్ ధర కంటె ఆర్బీకేల్లో లభించే ఎరువులు, విత్తనాలు తక్కువకే పొందవచ్చు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం. వీటితోపాటు వ్యవసాయ పనిముట్లు కూడా సబ్సిడీపై ఇస్తుండడం శుభపరిణామమం.

– రెడ్డిమోహన్, గుర్రంకొండ

9న ధర్మపథంలో ఆడికృత్తిక మహోత్సవాలు

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో ఈ నెల 9వ తేదీన ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. శనివారం ఆల యంలో షిరిడిసాయి సాలిగ్రామ తిరునారా యణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం స్థాని పట్టాభిరామాలయం నుంచి శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి బజారువీధి, గాంధీ బస్టాండ్, కొత్తపేటవీధి మీదుగా ఆలయానికి ఘనంగా ఉత్సవ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుబ్రహ్మణ్యస్వామికి కావడుల సమర్పణ జరుగుతుందని, వివరాలకు ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు 6301565571, 9985411591, 9985461224ను సంప్రదించాలని సూచించారు.

ఏపీఎస్బీసీఎల్ డిపో మేనేజర్‌గా ఆయిషాబేగం



మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్బీసీఎల్) మదనపల్లె డిపో మేనేజర్‌గా ఆయిషాబేగం శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఎస్ఈబీ ఏఈఎస్‌గా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా మదనపల్లె ఏపీఎస్బీసీఎల్ డిపో మేనేజర్‌గా నియమితులయ్యారు. అలాగే అన్నమయ్యజిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆయిషాబేగంకు అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో అక్రమ మద్యం అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

శ్రీ లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ఆలయంలోని స్వామివార్లకు ఉదయాన్నే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు


నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో 1988–1989 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం అదే పాఠశాలలో సందడి చేశారు. ప్రతి ఏటా 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులకు పూర్వ విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుంటారు. ఈ నేపథ్యంలో 2022–2023లో సత్తా చాటిన విద్యార్థులు లిఖిత్‌కుమార్‌రెడ్డి,నాగేశ్వరి, కావ్యలకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు హెచ్‌ఎం అపర్ణాదేవి సమక్షంలో పరీక్ష సమాగ్రి పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసులునాయక్

పీలేరు రూరల్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులునాయక్ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రస్తుతం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బేబికరుణ, ఉపాధ్యాయులు మాధవి, జయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసరాలు పంపిణీ చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న సివిల్‌సప్లయ్స్ డీఎం

తంబళ్లపల్లె : త్యవసర సరుకులు కార్డు దారులకు సకాలంలో పంపిణీ చేయాలని పౌర సరఫరాలశాఖ డీఎం ఎస్.మూర్తి తెలిపారు. శనివారం తంబళ్లపల్లె సివిల్‌సప్లయ్స్ గోడౌన్‌ను తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. ప్రతినెలా చౌకదుకాణాలకు సరుకులు పంపిణీ చేసి ఎండీయూల ద్వారా కార్డు దారులకు అందించేలా చొరవ చూపాలన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీటీ సుబ్రమణ్యం ఉన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శులు

తంబళ్లపల్లె : జగనన్న కాలనీలలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలని తంబళ్లపల్లె, పరషతోపు పంచాయతీ కార్యదర్శులు రమణ, సోమశేఖర్ సూచించారు. శనివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో కాలనీ ఇంటి పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారులను విచారించారు. కొందరు అధికారులు సహకరించడంలేదని లబ్ధిదారులు నుంచి విమర్శలు రావడంతో విచారణకు ఆదేశించారు. పట్టాలు పొంది, ఇంకా పనులు ప్రారంభించిన వారిని గుర్తించి వారికి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. వారి వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ బిందు ఉన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలతోనే అల్లర్లు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జయరామచంద్రయ్య

కేవీపల్లె : టీడీపీ నేత చంద్రబాబునాయుడు రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే అల్లర్లు, విధ్వంసాలు చోటు చేసుకున్నాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జయరామచంద్రయ్య అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు తన పర్యటనలో కార్యకర్తలను ఉసిగొల్పి దాడులు చేపించారని ఆరోపించారు. సొంత జిల్లా చిత్తూరులో గాలేరు – నగిరి పూర్తి చేయలేని అసమర్థుడైన చంద్రబాబుకు రాయలసీమ ప్రాజెక్టులు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. 14 ఏళ్లుగా సీఎంగా ఉండి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేని చంద్రబాబు ప్రాజెక్టుల యాత్ర చేయడం సిగ్గు చేటని విమర్శించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, చామంచుల సిద్ధయ్య, ఆంజినేయులు, కిరణ్‌నాయుడు, శ్రీకాంత్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, కాటమయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల భూ దందా


ప్రభుత్వ స్థలంలో రోడ్లు ఏర్పాటు చేసిన టీడీపీ నేతలు

పీలేరు : యథేచ్ఛగా చెరువు, వాగు పొరంబోకు స్థలాన్ని టీడీపీ నాయకులు కబ్జా చేసి విక్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవపల్లె వద్ద సర్వే నెంబర్లు 625లో చెరువు, 665లో వాగు పొరంబోకు మొత్తం సుమారు 2 ఎకరాల విలువైన భూమిపై టీడీపీ నాయకుల కన్నుపడింది. దీంతో స్థలాన్ని చదును చేసి వెంచర్లు వేశారు. సుమారు రూ. 10 కోట్లు విలువైన భూమిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. సంబంధిత స్థలంపై ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు నాలుగు రోజుల క్రితం పరిశీలించి ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అయితే అదే రోజు రాత్రే బోర్డులు తొలగించడం గమనార్హం. ఇదిలా ఉండగా ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు తాము మోసాపోయామని లబోదిబోమంటున్నారు. దీనిపై తహసీల్దార్ ధనుంజయలును వివరణ కోరగా.. ప్రభుత్వ స్థలాన్ని ఎవరూ ఆక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రామిక జనగర్జన విజయవంతం చేయండి


శ్రామిక గర్జనపై నినాదాలు చేస్తున్న కార్మికసంఘ నాయకులు

మదనపల్లె : నరేంద్రమోదీని గద్దె దించాలి.. దేశాన్ని రక్షించాలనే నినాదంతో ఆగస్టు 9న విజయవాడలో నిర్వహిస్తున్న శ్రామిక జనగర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మదనపల్లె సమితి పట్టణ కార్యదర్శి దేవ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో మదనపల్లె సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేవ మాట్లాడుతూ రాష్ట్రంలోని సివిల్ సప్లయి కార్మికుల సమస్యలు, ఇతర కార్మికవర్గ సమస్యలు పరిష్కరించాలని కేంద్ర కార్మికసంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆందోళనల్లో భాగంగా 9న అన్ని రాష్ట్ర రాజధాని కేంద్రాల్లో ఆందోళనకు పిలుపునిచ్చాయన్నారు. ఈ ఆందోళనల్లో భాగంగానే ఆగస్టు 6,7 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రచారజాతాలు 8న మానవహారాలు నిర్వహిస్తామన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న 42 కార్మికచట్టాల రద్దు, నాలుగు లేబర్‌కోడ్స్ ప్రవేశపెట్టడం, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌వ్యక్తులు, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడం తదితరాలన్నింటినీ కార్మికులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రజలు, కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రెడ్డెప్ప, తిరుమలప్ప, సురేష్‌కుమార్, నరసింహులు, అయూబ్, వీరాంజనేయులు, రఫీ, ఆంజనేయులు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం


మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

మదనపల్లె సిటీ : నాడు–నేడు పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలోని నాడు–నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి ఈనెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి కరుణాకర్, డివైఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, పద్మావతి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంటే మేటిగా ప్రభుత్వ పాఠశాలలు

కార్పొరేట్ కంటే మేటిగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతామని డీఈఓ పురుషోత్తం అన్నారు. జెడ్పీ పాఠశాలలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మొదటి విడత నాడు–నేడు కింద 605 పాఠశాలల్లో పనులు జరిగినట్లు తెలిపారు. ఇందులో ఏవైనా చిన్న పనులు మిగిలివుంటే ఫేస్ 2–ఎ కింద పనులు పూర్తి చేస్తామన్నారు. రెండవ విడత నాడు–నేడు పనులు 1038 పాఠశాలల్లో రూ.103 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. ఇందు కోసం ఇప్పటికే రూ.85 కోట్లు విడుదల చేశామన్నారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

జేవీకే కిట్లు పంపిణీ

ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికి జేవీకే కిట్లు పంపిణీ చేశామన్నారు. అందరిరీ అన్ని అందినట్లు తెలిపారు. టెక్స్‌బుక్స్, షూ కొందరికి అందలేదన్నారు. అయితే షూ కొలతల్లో తేడాలు ఉండటం వల్ల ఇందు కోసం ఎక్స్‌చేంజ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో విద్యార్థుల సైజుల ప్రకారం షూ అందజేయడం జరుగుతుందన్నారు.

డిజిటల్ తరగతులు

ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పాఠశాలు చెప్పడం కంటే చూసి నేర్చుకోవడంతో వారిలో మరింత విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఇందు కోసం ఐఎఫ్‌పీఎస్ ప్యానెల్ ద్వారా తరగతి గదిలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో హెడ్‌మాస్టర్, వార్డు, గ్రామ సచివాలయాల్లో వలంటీర్లు జీఈఆర్ వందశాతం పూర్తి చేయాలన్నారు. బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించాలన్నారు.

రెచ్చగొట్టడం, చిచ్చుపెట్టడం బాబు నైజం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం : అధికారం కోసం టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టడం, చిచ్చుపెట్టడం చంద్రబాబు నైజమని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో ములకలచెరువు, అంగళ్ళు, పుంగనూరులో పర్యటించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పోలీసులపై రాళ్ళ దాడి చేయించిన బాబు వైఖరిపై నిరసన తెలిపారు. శనివారం మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు విలేకరులతో సమావేశమయ్యారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర, 14 ఏళ్ళ సీఎం అనుభవం అంటే టీడీపీ గూండాలు, అల్లరి మూకలతో వచ్చి దౌర్జన్యాలు చేయించి రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసి ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ భయానక వాతావరణం సృష్టించడమేనా అని బాబును ప్రశ్నించారు. రాయలసీమకు టీడీపీ పాలనలో ఎన్ని ప్రాజెక్టులు కట్టారో బాబు బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. రూట్ మ్యాప్ షెడ్యూల్ ప్రకారం కాకుండా అనుమతులు లేని చోట ఎలా పర్యటిస్తారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ప్రజాదరణను చూసి జీర్ణించుకోలేని చంద్రబాబు బురదజల్లే వ్యాఖ్యలకు తెరలేపారని ఆరోపించారు. అల్లరి మూకలతో పోలీసు వాహనాలకు సైతం నిప్పు పెట్టించారని మండిపడ్డారు. నాయకులు మహమూద్, శివన్న, సుబ్బరాం, డ్రిప్ రమణ, కేవీ రమణ, సయ్యద్‌బాషా, తమక శంకర్, కార్యం చంద్ర, పుజేల్, భాస్కర్‌నాయుడు, పీఎస్ మధు, బొమ్మే వెంకట్రమణ, అయూబ్, సాదిక్, మహబూబ్‌బాషా, కేశవ్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యంపై ఫిర్యాదు


ఏఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తంబళ్లపల్లె : టీడీపీ నాయకులు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం ములకలచెరువు నుంచి అనుమతి లేకున్నా అంగళ్లు పర్యటనకురాగా ముదివేడు రిజర్వాయర్ నిర్మాణాన్ని కోర్టులో కేసు వేసి నిలుపుదల చేయడంతో ఆగ్రహించిన స్థానిక రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ప్రశ్నించేందుకు వెళ్లారు. అక్కడ చంద్రబాబు తన కార్యకర్తలను రెచ్చగొట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పురిగొల్పారు. ఆ సమయంలో తంబళ్లపల్లె మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి ఆ రైతుల వద్దకు వెళ్లి సమస్యను అడుగుతుండగానే రాళ్ళు, కర్రలతోవారిపైకి టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. టీడీపీ నాయకులు దేవరబురుజు రెడ్డెప్ప రెడ్డి, బేరి శ్రీనివాసులు అక్కడ ఉన్నారని వారిని విచారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ఏఎస్ఐ రెడ్డప్పనాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కరీమ్, శంకర్‌రెడ్డి, వైవి రమణారెడ్డి, రామచంద్రారెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

అంగళ్లు ఘటనపై ఫిర్యాదు

బి.కొత్తకోట : అంగళ్లలో జరిగిన ఘటనలకు కారకుడైన టీడీపీ అధినేత చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బి.కొత్తకోట జెడ్పీటీసీ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎస్ఐ రామమోహన్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో వచ్చిన చంద్రబాబు శుక్రవారం ములకలచెరువు నుంచి అంగళ్లుకు వస్తున్న సమయంలో మధ్యాహ్నం మండలంలోని ఖూనీతోపు వద్ద ఆపి అంగళ్లు వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అడ్డుపడితే వారిని తొక్కించండి, తరిమి తరిమి కొట్టండి అని అల్లర్లు సృష్టించే విధంగా టీడీపీ కార్యకర్తలను ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ కోరారు.

వీరవందన సభ జయప్రదం చేయండి

బి.కొత్తకోట : బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్ అధ్యక్షతన ఆదివారం అనంతపురంలో నిర్వహిస్తున్న వీర వందన సభను కార్యకర్తలు జయప్రదం చేయాలని బాస్ జిల్లా కార్యదర్శి సింగన్న కోరారు. శుక్రవారం ఆ సంఘ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీకేసీ పార్టీ, అంబేడ్కర్ వాదులు తరలిరావాలన్నారు. సభకు తమినాడు, ఏపీలకు చెందిన పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, ఎంపీలు హజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పలక వెంకటేష్, సీపీఐ నాయకులు ఖాసీం, వెంకటేష్‌బాబు, అహ్మద్, శ్రీనివాసులు, చెన్నకేశవులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

ములకలచెరువు : టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం పర్యటన అనంతరం ట్రాఫిక్ అంతరాయం, ఘర్షణలకు ప్రేరేపించే విధంగా మాట్లాడిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ గాయత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలచెరువు ఎంపీటీసీ ఆయిషా భర్త చాంద్‌బాషా ఫిర్యాదు మేరకు మండలానికి చెందిన శంకర్, నాగరాజు, సిద్దా, కేవీ రమణ, శ్రీనాథ్‌రెడ్డి, సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఉలవల కోసం పేర్లు నమోదు చేసుకోండి


మాట్లాడుతున్న ఏడీఏ శివశంకర్

మదనపల్లె : వర్షాభావ పరిస్థితులతో వేరుశనగ విత్తనాలు వేయని రైతులు ఖరీఫ్ 2023 సీజన్‌కు సంబంధించి ప్రత్యామ్నాయంగా ఉలవలు సాగుచేసుకోవచ్చని, విత్తనాలు అవసరమైన వారు ఆర్‌బీకే కేంద్రంలో తమ పేర్లను నమోదుచేసుకోవాలని ఏడీఏ శివశంకర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా మదనపల్లె డివిజన్ పరిధిలో వర్షాధారపంటలైన వే రుశనగ, కంది, అనుములు, జొన్న, సజ్జ మొదలగు పంటల సాగు విస్తీర్ణం 25శాతం మాత్రమే నమోదైందన్నారు. ప్రత్యామ్నాయపంటల్లో ముఖ్యంగా ఉలవ పంటను సెప్టెంబర్‌లో కురిసే వర్షాలకు వర్షాధారిత పంటగా వేసుకోవచ్చన్నారు. దీనికి సంబంధించి పీటీఎం మండలంలో 2,254 క్వింటాళ్లు, కురబలకోటలో 491, రామసముద్రం 435, మదనపల్లె 373, నిమ్మనపల్లె 304, బి.కొత్తకోట 711, ములకలచెరువు 914, తంబళ్లపల్లె 522 మొత్తం 5,004 క్వింటాళ్లు ఉలవలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో 80 శాతం సబ్సిడీతో ఆగస్టు 30 పైన పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విత్తనాల కోసం ఆగస్టు 8వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

'అద్దె చెల్లించలేదని వస్తువులు తీసుకెళ్లారు'



మాట్లాడుతున్న లలితారెడ్డి

మదనపల్లె : ఇంటి అద్దె చెల్లించలేదని, తనను బయటకు గెంటేసి, తన వస్తువులను ఎత్తుకెళ్లారని బాధిత మహిళ లలితారెడ్డి శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆవేదన వ్యక్తం చేసింది. ప్రశాంత్‌నగర్‌లోని సుధాకర్‌రెడ్డి ఇంట్లో 10 ఏళ్లుగా అద్దెకు ఉంటున్నానని, ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సక్రమంగా అద్దె చెల్లించకపోయినట్లు తెలిపింది. దీంతో ఇంటి యజమాని సుధాకరరెడ్డి కొందరు వ్యక్తులతో కలిసి పోలీసుల సహాయంతో తనను జూన్ 8న ఇంటి నుంచి గెంటేసి, తాళాలు వేశారన్నారు. తర్వాత అదేనెల 10వతేదీ రాత్రి ఇంటిలోని వస్తువులను లారీలో వేరేచోటకు తరలించారన్నారు. అప్పటి నుంచి తన సామగ్రిని అప్పజెప్పాలని ఇంటి యజమానిని వేడుకున్నా ఫలితం లేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కట్టుబట్టలతో తాను ఇంట్లో నుంచి బయటకు రావడం జరిగిందని, తనకు చెందిన విలువైన వస్తువులు యజమాని తరలించిన సామగ్రిలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా తన వస్తువులను తనకు అప్పగించాలని కోరారు.

వారపు సంతకు విద్యుత్ సౌకర్యం

పీలేరు : స్థానిక వారపుసంతలో విద్యుత్ సౌకర్యం కల్పించడానికి స్తంభాలు, సామగ్రి సిద్ధం చేసినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం వారపు సంతకు అవసరమైన 20 విద్యుత్ స్తంభాలు తెప్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారపుసంత, పూల మార్కెట్, చేపల మార్కెట్‌కు అనుగుణంగా విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చలపతి, సచిన్, ఈవో ప్రసాద్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో దంత వైద్యసేవలు

బి.కొత్తకోట : ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో శనివారం నుంచి స్థానిక సీహెచ్‌సీలో దంత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆస్పత్రిలో దంత పరీక్షలు, చికిత్సలకు అవసరమైన పరికరాలను సిద్ధం చేశారు. వాటిని మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ఆరీఫుల్లా, దంత వైద్యులు దుర్గాదేవి పరిశీలించారు. ఇకపై పూర్తిస్థాయిలో దంత వైద్య సేవలు చేయడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.